

వెల్దుర్తి: ఉప్పలింగాపూర్ బ్రిడ్జి వద్ద ఉధృతంగా హల్దీవాగు



నిజాంపేటలో పొలాల నుంచి చెరువులోకి ఉధృతంగా వరద



రామాయంపేట: అలుగు దుంకుతున్న దంతెపల్లి చెరువు



మెదక్ మున్సిపాలిటీ: భారీగా ప్రవహిస్తున్న పసుపులేరు వాగు

# ఏకధాటిగా వాన

- రెండు రోజులుగా దంచి కొడుతున్న వాన
- ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు నిండిన చెరువు, కుంటలు
- పొంగిపొర్లుతున్న హల్దీప్రాజెక్టు, చెక్‌డ్యాంలు, వాగులు, వంకలు
- బురదమయంగా మారిన రహదారులు

మెదక్ మున్సిపాలిటీ/ రామాయంపేట/ వెల్దుర్తి/ చిన్నశంకరంపేట/ నిజాంపేట/ చిలిపిచెడ్/ నర్సాపూర్/ శివ్వంపేట/ పాపన్నపేట్, సెప్టెంబర్ 1: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో శనివారం నుంచి ఆదివారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉన్నది. భారీ వర్షాలకు మంజీరా నది పొంగిపొర్లుతున్నది. దీంతో వనదుర్గా ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతున్నది. దుర్గామాత ఆలయం ఎదుట నుంచి నిజాంసాగర్ వైపు మంజీరా నది పరుగులు తీస్తున్నది. దీంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెదక్ శివారులోని పుష్పలవాగు, పసుపులేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారాయి. వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని హల్దీవాగుపై ఉన్న 11 చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి నిండిన చెరువులు, వాగులు, చెక్‌డ్యామ్‌లను చూసి యాసంగికి రందిలేదంటూ రైతులు మురిసిపోతున్నారు. గాలివానకు చెట్లు నేలకొరిగాయి. మరికొన్ని గ్రామాల్లో పంట నీట మునిగింది. కొన్ని ప్రాంతాల్లో ఉన్న కల్వర్టుపై నుంచి నీరు వెళ్తుండడంతో రెండు వైపులా రోడ్లను మూసివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు, గ్రామస్తులు ముందస్తు చర్యలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కూలిన ఇండ్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు వెళ్లి చూసి, బాధితులను పరామర్శించారు.

**అప్రమత్తంగా ఉండాలి**

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని గుర్తించి వేరే చోటకు తరలించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాల వద్దకు ఎవరూ వెళ్లవద్దని, విద్యుత్ పరికరాలను తడి చేతులతో ముట్టుకోవద్దని అధికారులు తెలిపారు. నర్సాపూర్ అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై భారీ వృక్షం కూలింది. ఆయా మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. చేపలు పట్టడానికని కాల్వలు, వాగులు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేసి, పోలీసులు, అధికారుల సహాయం పొందాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వెల్లడించారు.



నర్సాపూర్: అచ్చంపేట్ కుంటలో చేరిన వరద



చిలిపిచెడ్: భారీ వర్షానికి పొలాల్లో నిలిచిన వర్షం నీరు



చిన్నశంకరంపేట: కొర్విపల్లి చెరువు నీటిలో మునిగిన వరి



నర్సాపూర్: అచ్చంపేట్ కుంటలో చేరిన వర్షపు నీరు



పెద్దశంకరంపేట: చెరువులను పరిశీలిస్తున్న అధికారులు



చిన్నశంకరంపేట: టీ మాందాపూర్ గిరిజన తండా వద్ద వరద



వెల్దుర్తి: కునూర్ చెక్‌డ్యాం



బండపోసాన్‌పల్లి బషీర్‌చెరువు



రామాయంపేట: వరదతో నిండిన కోనాపూర్ పెద్ద చెరువు



చిన్నశంకరంపేట: సూరారం నుంచి ధర్పల్లి వెళ్లే రోడ్డులో మొద్దులు అడ్డంగా పెడుతున్న పోలీసులు



చిన్నశంకరంపేట: దామరచెరువు, గవ్వలపల్లి మత్తడి



నర్సాపూర్: కూలిన వృక్షాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్



రామాయంపేట: వర్షానికి కూలిన లింగాపూర్‌లోని పెంకుటిల్లు



నిజాంపేట: నందిగామ సాయిచెరువు వద్ద రైతులు

## అప్రమత్తంగా ఉండాలి



మెదక్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, తదితరులు

- అధికారులకు సెలవులు రద్దు
- 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- కంట్రోల్ రూం ఏర్పాటు
- ఎమర్జెన్సీ 9391942254లో సంప్రదించాలి

మెదక్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 396 చెరువులు నిండాయని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, ఇరిగేషన్, హెల్త్, ఎడ్యుకేషన్, ఎలక్ట్రిసిటీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**భారీ వర్షాలకు నేడు విద్యా సంస్థలకు సెలవు**

మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులకు సెలవులు రద్దు చేశామని, 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మరో రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రమాదకరంగా ప్రవహించే చెరువులు, కాల్వలు వద్దకు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్ 9391942254కు ఫోన్ చేయాలని సూచించారు.

## ధర్మ రక్షణకు వీహెచ్‌పీ రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రచార ప్రముఖ్ బాలస్వామి

రామాయంపేట, సెప్టెంబర్ 1: హిందువుల్లో ఆత్మవిశాసం నింపుతూ గత వైభవాన్ని సాధించేందుకు విశ్వహిందూ పరిషత్ ఉద్యమిస్తున్నదని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తెలిపారు. ఆదివారం రామాయంపేట భరతమాత ఆలయంలో ఆయన మాట్లాడుతూ హిందువులంతా ఒక్కటై హిందూ ధర్మ రక్షణకు పోరాడాలన్నారు. మతమార్పిడులకు మద్దతు పలుకొద్దన్నారు. హిందూ ధర్మాన్ని కూల్చడం కోసం కొన్ని మాఫియాలు వస్తున్నాయని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, కార్యదర్శి మల్లేశం, ఎర్రం ముత్యాలు, గోపిశెట్టి అనంతలక్ష్మి, తాటిపల్లి శ్రీనివాస్, పంజా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ చర్చిని సందర్శించిన హైకోర్టు రిటైర్డు జడ్జి



రిటైర్డు జడ్జి విమల జైన్ దంపతులను సత్కరిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 1: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిని మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డు జడ్జి విమల జైన్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చర్చి ప్రేసిబేటరి ఇన్‌చార్జి శాంతయ్య చర్చి విశిష్టతను వారికి తెలిపారు. అనంతరం చర్చి కమిటీ సభ్యుడు గంట సంపత్ ఆధ్వర్యంలో వారిని శాలువాలు కప్పి సత్కరించి, చర్చి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ చర్చి కమిటీ సభ్యులు సువన్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి





నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

- పాత పెన్షన్ పునరుద్ధరించాలి
- టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 1: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో టీజీఈ జేఏసీ, జిల్లా కేంద్రంలోని తపస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినంలో జేఏసీ నాయకులు, తపస్ నాయకులు పాల్గొన్నారు. బ్లాక్ రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టో చెప్పిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. సీపీఎస్ రద్దు విషయం రాష్ట్ర పరిధిలోని అంశం అయినందున వెంటనే స్పందించి రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యాక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొండల్‌రెడ్డి, పద్మారావు, కృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజగోపాల్, సత్యనారాయణ, మల్లారెడ్డి, యాదగిరి, సమావేశంలో తపస్ నాయకులు లక్ష్మణ్, నర్సింలు, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, మధుమోహన్, వినోద్, మధు. నరేందర్ పాల్గొన్నారు.

## శిశుమందిర్‌లో సామూహిక అగ్ని హోత్రం

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 1: స్థానిక సరస్వతి శిశుమందిరంలో విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక అగ్ని హోత్రం నిర్వహించారు. పర్యావరణ రక్షణకు హోమాలు ఉపయోగపడుతాయని వక్తలు పేర్కొన్నారు. లోకకల్యాణార్థం అన్ని గ్రామాల్లో అగ్నిహోత్రం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జైహింద్‌రెడ్డి, సీతారామారావు, వీరప్ప, సతీశ్ గౌడ్, మల్లేశం, సంగమేశ్వర్ పాల్గొన్నారు.



దుర్గామాత ఆలయాన్ని మూసివేస్తున్న పూజారులు

## దుర్గా మాత ఆలయం మూసివేత

### రాజగోపురంలో పూజలు

పాపన్నపేట్, సెప్టెంబర్01ః రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంజీరా నది ఉధృతంగా ప్రవహించడంతో వనదుర్గా ప్రాజెక్టులోకి భారీగా వరద చేరింది. దీంతో ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఎదుట నుంచి మంజీరా నది ప్రవహించడంతో ఆదివారం మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. ఆలయాన్ని ఉదయాన్నే తెరిచి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వర్షాలు తగ్గి మంజీరా శాంతించే వరకు రాజగోపురంలోనే పూజలు నిర్వహిస్తామని ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఏడుపాయల్లో ఎలాంటి ప్రమాదకర ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, డీఎస్పీతో సహ పోలీసు సిబ్బందితో స్వయంగా పరిశీలించారు. భక్తులెవరు బారికేడ్లు దాటి ఆలయ దిక్కు వెళ్లద్దని ఎస్పీ ఆదేశించారు.



ఏడుపాయల్లో ఆలయం వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

## కొప్పోల్‌లో ప్రత్యేక పూజలు

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 1: దక్షిణా కాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయంలోని గర్భగుడిలో కాశీబుగ్గ నీరు రావడంతో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కాశీ నుంచి నేరుగా కొప్పోల్ గర్భాలయంలోకి ప్రత్యేకంగా నీరు రావడాన్ని కాశీ బుగ్గగా భక్తుల నమ్మకం. ఆదివారం వేకువ జామున ఆలయంలో కాశీబుగ్గ రావడంతో భక్తులు భజనలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుర్రపు మచ్చేందర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



## నేడు ప్రజావాణి రద్దు

మెదక్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## శ్రీనివాస నిధికి రూ.లక్ష విరాళం



రామాయంపేట, సెప్టెంబర్ 1: వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా శ్రీనివాస నిధికి పట్టణానికి చెందిన వ్యాపారి సకిలం సిద్దిరాములు– రాణి దంపతులు రూ.1,01,116ను ఆదివారం విరాళంగా అందజేశారు. అనంతరం దంపతులు గోదా సమేతా వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి సన్మానించారు. పట్టణానికి చెందిన స్వర్ణకారుడు వేణు చారి దంపతులు 108 వెండి పుష్పాలు అందజేశారు.

## హీరో సుమన్‌ను కలిసిన కరాటే మాస్టర్



రామాయంపేట, సెప్టెంబర్ 1: హైదరాబాద్‌లో జరుగుతున్న కరాటే పోటీల్లో రామాయంపేట నుంచి కరాటే మాస్టర్ రామకృష్ణతో పాటు మరో 50 మంది పాల్గొనేందుకు వెళ్లారు. ఆదివారం పోటీలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన సినీ నటుడు సుమన్‌ను వారు కలిశారు.

## నత్నాయపల్లిలోని నాలుగు ఇండ్లలో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

నర్సాపూర్, సెప్టెంబర్1: మండలంలోని నత్నాయపల్లి గ్రామంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన నాలుగు ఇండ్లలో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో బంగారం, వెండి, నగదు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నత్నాయపల్లికి చెందిన జిల్లా ప్రభాకర్, నీలి సునీత, పేట పెంటమ్మ, నీలి పోచమ్మ ఇండ్లకు తాళం ఉండడంతో అదే అదునుగా చూసి దొంగలు తాళాలు పగల గొట్టి చోరీకి తెగపడ్డారు. జిల్లా ప్రభాకర్ ఇంట్లో 15 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు, నీలి సునీత ఇంట్లో 30 వేల నగదు, ఉంగురం, 13 తులాల వెండి పట్టగొలుసులు, పేట పెంటమ్మ ఇంట్లో రూ.50 వేల నగదు, నీలి పోచమ్మ ఇంట్లో రూ.13 వేల నగదును దొంగలు అపహరించారు. నర్సాపూర్ మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు



చిలిపిచెడ్, సెప్టెంబర్ 1: భక్తులకు కొంగు బంగారమై కోరికలు తీర్చే శ్రీ చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని వెలిసిన శ్రీ చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం సమీపంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. కొంతమంది భక్తులు వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర శర్మ అమ్మవారికి అలంకరించారు.

## సేవకు ఉత్తమ పురస్కారం

చిన్నశంకరంపేట, సెప్టెంబర్01: మండలంలోని ఖాజాపూర్‌కు చెందిన సానీక్ష స్వచ్ఛంద సంస్థ చైర్మన్ శివకు ఉత్తమ సేవా పురస్కారాన్ని హైదరాబాద్‌లో ఆదివారం అందజేశారు.

